
సాక్షి
కాకినాడ
మంగళవారం । 25 । జూలై । 2023



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఉండవల్లి వేంకట సుబ్బారావు (రాయవరం మండలం నదురుబాద) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



మామిడికుదురు/సఖినేటిపల్లి: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి, అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వార్ల ఆలయాల్లో నిత్యాన్నదాన ట్రస్టుకు చిలువూరి సూర్యనారాయణరాజు, వాణి దంపతులు (అయినవిల్లి మండలం పోతుకుర్రు) సోమవారం చెరో రూ.50 వేల చొప్పున విరాళం సమర్పించారు.

వివాహాల వివాదానికి చెక్

- పురోహితుల వేలం పాట రద్దు
- గతంలో మాదిరిగానే పెళ్లి చేయవచ్చు
- వధూవరులకు ఆధార్ కార్డు.. పురోహితులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి
- సింగిల్ విండోలో పెళ్లిబృందాలకు రూములు, సన్నాయి మేళం, భోజనాలు
- ప్రతి గురువారం స్వామి నిజరూప దర్శనం
- దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ వెల్లడి

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివాహ పురోహితుల సంభావన హక్కు కోసం నిర్వహించ తలపెట్టిన వేలం పాటను పూర్తిగా రద్దు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దేవస్థానం ఈఓ చంద్ర శేఖర్ అజాద్ సోమవారం సాయంత్రం ఈ విషయం తెలిపారు. ఈ నెల 28న జరిగే దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలో దీనిపై చర్చించి ప్రత్యామ్నాయ పద్ధతిని ప్రవేశపెట్టనున్నామన్నారు. దేవస్థానంలో పురోహితులెవరైనా గతంలో మాదిరిగానే వివాహాలు చేయించవచ్చునన్నారు. వివాహం చేసుకునే వధూవరులు ఆధార్ కార్డు లేదా, వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అలాగే వివాహం చేయించే పురోహితులు తమ ఐడీ కార్డు, ఆధార్ కార్డు నకలు దేవస్థానానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

మోసం చేయకుండా..

పెళ్లి బృందాలను మధ్యవర్తులు.. దళారీలు మోసం చేయకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు ఈఓ తెలిపారు. ఇందుకోసం ప్రత్యామ్నాయ పద్ధతి ప్రవేశపెడతామన్నారు. వివాహాలు చేయించే పురోహితునికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు. అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం, బయట ప్రాంతాల నుంచి వచ్చి వివాహాలు చేయించే పురోహితులు, పెళ్లిబృందాలు కూడా తీసుకుని వచ్చే ఇంటి పురోహితులను సమన్వయం చేస్తూ నిర్ణయం ఉంటుందని వివరించారు. పెళ్లి బృందాలకు దేవస్థానం నిర్ణయించిన రుసుముకు సన్నాయి మేళం, భోజనాలు, రూములు, మండపం కేటాయింపులో సింగిల్ విండో విధానం కొనసాగుతుందని వివరించారు. ఇందులో వివాదానికి తావు లేదని పునరుద్ఘాటించారు.



మరికొన్ని కీలక నిర్ణయాలు

- తిరుమలలో వేంకటేశ్వరుని నిజరూప దర్శనం తరహాలో ప్రతీ గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సత్యదేవుని నిజరూప దర్శనం కల్పించనున్నారు. ఆ సమయంలో భక్తులు స్వామి, అమ్మవార్లకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించుకోవచ్చు.
- దిగువన యంత్రాలయంలోని గణపతి, సూర్య భగవానుడు, బాలాత్రిపురసుందరి, ఈశ్వరుని విగ్రహాల మీదుగా భక్తులు ప్రదక్షిణగా వెళుతున్నారు. ప్రదక్షిణ మార్గంలో ఆ విగ్రహాల ప్రదేశంలో కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ, అభిషేక గంధం ఉంచాలని నిర్ణయించారు.
- ఆలయం వెనుక గోడ మీద చక్రం, దాని మీద స్వామివారి రూపాన్ని చెక్కించాలని నిర్ణయించారు.
- వ్రత మండపాలలో వృద్ధులు, వికలాంగులు కింద కూర్చుని వ్రతాలాచరించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వీరి కోసం ఒక వరుసలో ఎత్తయిన టేబుల్స్, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయనున్నారు.
- **రామాలయం సమీపాన జమ్మిచెట్టు వద్ద శమీ దేవత విగ్రహం ఏర్పాటు చేస్తారు. విగ్రహం ఎదుట గంటను పెట్టి శమీ వృక్షం విశిష్టత తెలిపేలా బోర్డులు ప్రదర్శిస్తారు.**
- వ్రతాల విభాగానికి ఒక పర్యవేక్షకుడిని మాత్రమే ఇకపై నియమించనున్నారు.
- స్వామివారి నమూనా ఆలయంలో సిమెంట్ విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. అక్కడ కూడా నిత్యం పూజా కైంకర్యాలు చేసేందుకు అర్చకుడు, వంట స్వామిలను నియమిస్తారు.
- ప్రతి సోమవారం సత్యదేవుని ముత్యాల కవచం అలంకరణలో ఇకపై ముత్తంగి సేవ నిర్వహించనున్నారు.
- సుప్రభాత సేవ అనంతరం ఈశ్వరునికి అభిషేకానికి భక్తులను అనుమతించనున్నారు.
- దద్దోజన ప్రసాదం మరింత రుచిగా తయారు చేసేందుకు దినుసుల దిట్టం పెంచనున్నారు.
- పవళింపు సేవకు లిఫ్ట్ పక్కన రేకుల షెడ్డు నిర్మిస్తారు.
- కేశఖండన శాలలో వ్రతమండపాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించనున్నారు.
- ఈ అంశాలను ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

ఇకపై సత్య విదియ

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి ఆవిర్భావ వేడుకలను వచ్చే నెల 18న ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ సత్యదేవుని జయంతి పేరిట ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే శ్రీకృష్ణుని జయంతిని కృష్ణాష్టమిగా, శ్రీరాముని జయంతిని శ్రీరామ నవమి పిలుస్తున్నట్టుగానే శ్రావణ శుద్ధ విదియ నాడు వచ్చే సత్యదేవుని జయంతి పేరును 'సత్య విదియ'గా మార్చాలని నిర్ణయించారు. ఈ వేడుకల ఏర్పాట్లపై అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌లు దేవస్థానం ఆస్థాన ఆగమ పండితులతో సోమవారం సమీక్షించారు. సత్య విదియ వేడుకలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. వచ్చే నెల 17న స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఆ మర్నాడు సత్య విదియను పురస్కరించుకుని సత్యదేవునికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ అంశాలపై ఈ నెల 28న జరిగే దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో కూలంకషంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈఓ అజాద్ విలేకర్లకు తెలిపారు. సమావేశంలో దేవస్థానం ప్రధాన వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ ఘనపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, ఏఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.



సత్యదేవుని శాలువా నమూనా

స్వామివారి నామంతో శాలువాలు

కాగా, 'జై సత్యదేవ' పేరిట స్వామివారి నామం ముద్రించిన శాలువాలను కూడా త్వరలో దేవస్థానంలో విక్రయించనున్నారు. ఇవి టీటీడీలో వేంకటేశ్వర స్వామివారి శాలువాల మాదిరిగా ఉంటాయని ఈఓ తెలిపారు. 2.30 మీటర్లు పొడవు, 36 సెంటీమీటర్ల వెడల్పుతో ఈ శాలువాలు తయారు చేసి, సరఫరా చేసేందుకు తమిళనాడులోని సేలం పట్టణానికి చెందిన పీవీపీకే టెక్స్ రూ.263.50కు కోట్ చేసిందని వివరించారు. దీనికి జీఎస్టీ అదనమని చెప్పారు. 3 వేల శాలువాలకు సుమారు రూ.8.80 లక్షల ఖర్చవుతుందన్నారు. దీనిపై ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు 22 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీలు

తుని రూరల్: భీమవరంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తుని మండలం వి.కొత్తూరు గురుకుల పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థినులు ఎంపికై నట్టు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి సోమవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో ఇటీవల జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్ 11, 14, 17, 19 రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థినులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వీరంత భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి పీడీ జయలక్ష్మి, పీఈటీ సాధన శిక్షణ ఇచ్చారని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 23న యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 యోగా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి జి. సోమసూర్యచరణ్, 8వ తరగతి విద్యార్థిని జి.హర్షవర్ధని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. సోమసూర్యచరణ్ సాంప్రదాయ, రిథమిక్ యోగా విభాగాల్లో ప్రథమ స్థానం సాధించాడన్నారు. హర్షవర్ధని సాంప్రదాయ యోగా విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, హెచ్‌ఎంలు అపర్ణ, నీలాదేవి, యోగా గురువు సురేష్ అభినందించారు.

ఇన్‌చార్జి డీఈఓగా ఆర్జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా పాఠశాల ఆర్జేడీగా విధులు నిర్వహిస్తున్న జి.నాగమణిని నియమించారు. డీఈఓ కేఎస్‌ఎస్ అన్నపూర్ణ సెలవుపై వెళ్లడంతో ఆమె తిరిగి విధుల్లోకి వచ్చే వరకూ ఇన్‌చార్జి డీఈఓగా నాగమణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం, లేదా గురువారాల్లో బాధ్యతలు తీసుకుంటానని ఆమె వివరించారు.

పోలీస్ స్పందనకు 62 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల చెందిన వారు మొత్తం 62 ఫిర్యాదులను అందజేశారు. వీటిని ఎస్పీ సతీష్‌కుమార్ నేరుగా స్వీకరించారు. ఫిర్యాదుదారుల్లో 39 మంది మహిళలు, 23 మంది పురుషులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సర్వే

సమీక్షలో కలెక్టర్ కృతికా శుక్లా



సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: బీఎల్‌వోలతో చేపట్టిన ఓటర్ల జాబితా సర్వేను విజయవంతంగా కొనసాగించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వివిధ అంశాలపై అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. ఓటర్ల జాబితా తనిఖీలో వలంటీర్లు పాల్గొనడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అతిక్రమించే బీఎల్వోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సీసీఆర్సీ కార్డులు పంపిణీ వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో కౌలు రౌతులందరికీ కార్డులు పంపిణీ చేపట్టాలన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి పంట రుణాలు మంజూరు ప్రక్రియ చేపట్టాలన్నారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాల మంజూరు చేయించాలన్నారు. వలంటీర్ ఎడ్యుకేషన్ సర్వే, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న పాలవెల్లువ పథకానికి సంబంధించి బీఎంసీయూ యూనిట్ల గ్రౌండింగ్ చేపట్టాలని, నిర్మాణ పనులు పూర్తయిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కృతికా శుక్లా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, డీఈవో కెఎస్‌ఎస్ అన్నపూర్ణ, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ ఎం శ్రీనివాస్, కాకినాడ డీఎల్డీవో పి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. మెట్ట రైతుల హర్షం

- నాలుగైదు రోజులుగా జిల్లాలో ముసురు
- మెట్టలో సాగుకు సానుకూలంగా వాతావరణం

కాకినాడ సిటీ: కొద్దిరోజులుగా ఊరిస్తున్న వాన ఎట్టకేలకు కరుణించింది. నాలుగైదు రోజులుగా జిల్లాను వాన ముసురు వెంటాడుతోంది. జిల్లాలో చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. ఫలితంగా మెట్ట రైతుల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి చిన్నపాటి ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఇళ్ల నుంచి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షాలు విస్తృతంగా కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. మెట్ట ప్రాంతాల్లో వివిధ రకాల పంటల సాగుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. మంగళ, బుధ, గురువారాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తాజా వర్షాలకు కాకినాడ నగరంలోని కొన్ని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలనీల్లో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఏలేశ్వరంలో భారీ వాన

జిల్లాలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ సగటున 18.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఏలేశ్వరం మండలంలో అత్యధికంగా 42.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కాజులూరు మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా నమోదైన వర్షపాతం మిల్లీమీటర్లలో.. రౌతులపూడిలో 40.2, సామర్లకోట 37, పిఠాపురం 36.2, గొల్లప్రోలు 33.8, జగ్గంపేట 32, గండేపల్లి 30.6, యు కొత్తపల్లి 28.8, కిర్లంపూడి 28.2, కాకినాడ రూరల్ 19, కాకినాడ అర్బన్ 14.6, పెద్దాపురం 13.6, పెదపూడి 11.6, శంఖవరం 7.4, తాళ్లరేవు 5.8, కరప 5.4, తొండంగి 1.2, కాజులూరు 0.8 వర్షపాతం నమోదైంది.

వాన నుంచి వరి రక్షణకు చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో వర్షాల నేపథ్యంలో వివిధ దశల్లో ఉన్న వరి పంట దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్‌కుమార్ సూచిస్తున్నారు. ఈ ఖరీఫ్‌కు జిల్లాలో 92082 హెక్టార్లలో వరి లక్ష్యంకాగా ఇప్పటి వరకూ 30 వేలహెక్టార్లలో ఊడ్పులు, వెదజల్లు సాగు పూర్తయ్యాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వరి విత్తనం చల్లిన రెండు మూడు రోజుల తర్వాత మూడు రోజులు కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది.
- ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు తీసేస్తే విత్తనం పొర గాలిపోసుకుంది. దీంతో నష్టం జరగదు
- నీరు తీయడానికి వీలు లేకపోతే మొలక దెబ్బతింటుంది. అప్పుడు తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.
- విత్తిన ఏడు నుంచి నెల రోజుల మధ్యలో నారుమడి ఐదు రోజులు కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతింటుంది. నీట మునిగిన ఐదు రోజులు లోపు నీటిని బయటకు తీసేయాలి. పంటకు గాలి తగిలేలా చేయాలి.
- నీటిని బయటకు తీసివేశాక ఐదు సెంట్ల నారుమడిలో కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. దీనివల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది.
- నారుమడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేశాక.. మొక్క నిలదొక్కుకున్న తర్వాత లీటరు నీటికి గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజంతో మాంకోజెట్ కలిపిన మిశ్రమాన్ని పిచికారి చేయాలి.
- పంట ఊడ్చిన వెంటనే , పిలక దశలో ముంపునకు గురైతే నీటి బయటకు తీశాక ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి.
- బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. కోలుకున్న తర్వాత కుళ్లు తెగుళ్ల రాకుండా లీటరు నీటికి గ్రాము కార్బెండిజం కలిపి పిచికారి చేసుకోవాలని జేడీ వివరించారు.



బెండపూడిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

స్పందనకు కేరాఫ్ 'జగనన్నకు చెబుదాం'

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం (స్పందన)లో వినతులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌ఎడ్డి, సీపీవో పి త్రినాథ్, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డీఎస్ సునీతలతో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 291 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచేలా నిర్ణీత కాల వ్యవధిలో వినతులను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు.



జగనన్నకు చెబుదాం స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

వారంలో సమస్య పరిష్కారం



నాకు తొండంగి మండలం, వేమవరంలో సర్వే నంబ ర్ 31-1లో ఎ 1-10 సెంట్లు భూమి ఉంది. గ్రామ సచివాలయంనుంచి అడంగల్ తీసుకోగా ఆయకట్టు విస్తీర్ణం సున్నాగా చూపించింది. వెంటనే ఈనెల 17న జగనన్నకు చెబుదాంలో వెబ్‌ల్యాండ్ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. ఆన్‌లైన్‌లో సవరించి వారం రోజుల్లోనే సమస్య పరిష్కరించారు.

– కందిపల్ల అప్పలకొండ, మాధవపురం, పిఠాపురం మండలం

తక్షణ స్పందన



మా గ్రామంలో సర్వే నంబర్ 112-2ఎ1లో డి పట్టా భూమి ఉంది. వెబ్ ల్యాండ్‌లో 112-2ఎ4గా నమోదు చేశారు. దీనిపై జగనన్నకు చెబుదాంలోలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాను. ఈ నెల 21న తహసీల్దార్‌కు సవరణ కోసం అనుమతి ఇవ్వగా అదే రోజు వెబ్‌ల్యాండ్‌లో సవరించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ కృతికా శుక్లాకు ధన్యవాదాలు.

– చవల చిట్టయ్య, రామన్నపాలెం, శంఖవరం మండలం.

సీఎం పర్యటన 28కి వాయిదా

వర్షాలతో 26వ తేదీ పర్యటన రద్దు



సాక్షి, అమలాపురం: పట్టణంలో ఈ నెల 26న జరగాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన భారీ వర్షాల కారణంగా ఈ నెల 28కి వాయిదా పడింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. సీఎం జగన్ 28వ తేదీ ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్‌లో అమలాపురం పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బాలయోగి స్టేడియంలోని వేదిక వద్దకు చేరుకుంటారు. ఉదయం 11.25 గంటలకు మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ నిధులను బటన్ నొక్కి జమ చేస్తారు. తిరిగి మధ్యాహ్నం 1.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి వెళతారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అమలాపురం వచ్చి, ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారుల ఖాతాల్లో సున్నా వడ్డీ రాయితీ నిధులు జమ చేయాల్సి ఉంది. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వారం రోజులుగా అహర్నిశలూ పని చేస్తోంది. స్థానిక బాలయోగి స్టేడియంలో సభా వేదికను సిద్ధం చేశారు. సోమవారం నాటికి ఇంచుమించు సభా వేదిక అంతా సిద్ధమైంది. ఆర్‌డీఓ కార్యాలయం వెనుక పాత పోలీసు క్వార్టర్ల వద్ద హెలిపాడ్‌ను సిద్ధం చేశారు. సీఎం పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ ఉదయం పరిశీలించారు. మధ్యాహ్నానికి సీఎం పర్యటన షెడ్యూలు వచ్చింది. అయితే మధ్యాహ్నం నుంచి కోనసీమ వ్యాప్తంగా భారీ వర్షం పడటం, మరో నాలుగైదు రోజుల పాటు వానలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో సీఎం పర్యటన 28వ తేదీకి వాయిదా వేస్తూ తాజా షెడ్యూలు విడుదలైంది.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్

రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద సాయి వేదికలో సోమవారం రాత్రి హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ముస్లింల సంక్షేమం కోసం కృషి చేసింది ఇద్దరే నన్నారు. అందులో ఒకరు వైఎస్‌ఆర్ కాగా మరోకరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచి స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కేంద్రం రూ.14.50 కోట్లు చెల్లించకపోతే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ చెల్లించి ముస్లింలు హజ్ యాత్రకు సహకరించారన్నారు. నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి తాను కృషి చేస్తున్నట్టు తెలిపారు. ముస్లింల సమస్యలను రాతపూర్వకంగా ఇస్తే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్‌ఆర్, హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మా హృదయాల్లో వైఎస్సార్ ఉన్నారు.. మేమంత జగన్ వెంటే ఉన్నాం అంటూ ముస్లింలు నినాదాలు చేశారు. స్టేట్ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్, కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహమాన్ ఖాన్, వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కార్యదర్శి కరీంబాషా, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీను, రాష్ట్ర వ్యవసాయ మండలి డైరెక్టర్ లంక ప్రసాద్ పాల్గొన్నారు.



హర్ దిల్ మే వైఎస్‌ఆర్, హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

ముగిసిన బిలియర్డ్స్, స్నూకర్స్ పోటీలు



పోటీలలో విజేత పాండురంగరావుకు కప్ అందిస్తున్న అర్జున అవార్డు గ్రహీత అశోక్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా టౌన్‌హాల్, కాస్మోపాలిటన్ క్లబ్ ప్రాంగణాల్లో జరుగుతున్న బిలియర్డ్స్, స్నూకర్స్ పోటీలు సోమవారంతో ముగిశాయి. భారతం లక్ష్మీపతి సోమయాజులు జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీలలో మొదటి స్థానాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన పాండురంగరావు దక్కించుకున్నారు. రన్నర్‌గా తెలంగాణకు చెందిన బ్రాండెన్ నిలిచారు. విజేతలకు వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్, అర్జున అవార్డు గ్రహీత అశోక్ శాండిల్య కప్‌లను అందజేశారు. బిలియర్డ్స్, స్నూకర్స్ క్రీడలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచడానికి పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అశోక్ సూచించారు. టౌన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి టౌన్‌హాల్ అధ్యక్షుడు నానాజీ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, జీవీ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు మధ్యాహ్నం వరకూ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. అనంతరం విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. వచ్చే నెల 3వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం ఉంది. ఆగస్టు 4వ తేదీ వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 3 నుంచి 8వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు, 12వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి జేఎన్‌టీయూ–కాకినాడ, ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాలు మంగళవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థులకు సందేహాలుంటే ఈ కేంద్రాల్లో సంప్రదించవచ్చు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

కొత్తపల్లి: సముద్రంలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. సామర్లకోట మండలం వేమవరం గ్రామానికి చెందిన పసుపులేటి వీర ప్రభాకరరావు తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం తుని లోవ దేవస్థానంలో కొలువు తీరిన తలుపులమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తూ మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట ఎస్ఎస్ఆర్ హేచరీ ఎదురుగా సముద్ర తీరంలో ఆగారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలసి ప్రభాకరరావు కుమారుడు పార్థు కమల చక్రి (9) కెరటాల్లో కొంతసేపు ఆడుతూ సముద్రంలో గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులు బోట్లపై ఎంత గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. కోనపాపపేట సమీప తీర ప్రాంతంలో సోమవారం ఉదయం పార్థు మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అడ్మిషన్లు జరుగుచున్నవి
కోర్సులు: 1) DMLT 2) D.A.N.S (Anesthesia)
అర్హత: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన)
SHINE PARAMEDICAL INSTITUTION
(Recognised by AP Para Medical Board)
Muncipal Colony, RAJAHMUNDRY
Cell: 91601 00777, 93989 27447

జింకా.. వస్తావా ఈ వంక!


లంక భూముల్లో కృష్ణజింకలు (ఫైల్)

పిల్లలు ఉత్సాహంగా గంతులు వేస్తూ, పరుగులు తీస్తూ, ఆటలాడుతూంటే.. జింకలా చెంగుమంటూ దూకుతున్నారని పెద్దలు ఆనందపడతారు. అందమైన ముఖం.. నేరేడు పండ్ల వంటి కళ్లు.. బెదురు చూపులు.. లేత గోధుమ రంగులో చక్కని శరీరం.. ముచ్చటైన కదలికలతో జింకలు చూడగానే ఎంతో ఆకట్టుకుంటాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఒకప్పుడు వందలాదిగా కృష్ణజింకలు సంచరిస్తూండేవి. నేడు అప్పుడప్పుడు మెరుపులా మెరుస్తున్నాయే తప్ప.. గతంలో మాదిరిగా వాటి సంచారం కానరావడం లేదు. వీటి సంరక్షణకు అటవీ శాఖ కృషి చేయాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

- గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జాడ లేని కృష్ణజింకలు
- సంరక్షణను పట్టించుకోని అటవీ శాఖ
- చర్యలు చేపట్టాలంటున్న జంతు ప్రేమికులు
- ఆవాస కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

కొత్తపేట: మండపేట – కొత్తపేట నియోజకవర్గాల మధ్య గౌతమీ గోదావరి నదీ తీరాన దుబ్బుగడ్డి దిబ్బల్లో.. లంక భూముల్లో ఒకప్పుడు చెంగుచెంగున ఎగురుతూ కనువిందు చేసే కృష్ణజింకలు కనుమరుగయ్యాయా అంటే అవుననే అంటున్నారు జంతు ప్రేమికులు. రావులపాలెం మండలం ఊబలంక, రావులపాలెం, జొన్నాడ – రావులపాలెం వంతెన; కపిలేశ్వరపురం మండలం కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, తాతపూడిలంక, బోళ్లంక, అద్దంకివారిలంక; కొత్తపేట మండలం వానపల్లి లంక ప్రాంతాలు జింకలకు నిలయాలుగా ఉండేవి. గోదావరి పొడవునా నది మధ్యలోని చెట్లు, పొదలు, గడ్డి దుబ్బులు పెరిగే దిబ్బలు వీటికి ఆవాసం. గోదావరిలో స్వచ్ఛమైన నీరు, కావాల్సిన ఆహారం లభించడంతో వందలాదిగా జింకలు ఈ ప్రాంతాల్లో సంచరించేవి. వీటితో పాటు వివిధ అడవి జంతువులు కూడా తిరిగేవి. వలస పక్షులు విహరించేవి. గత ఏడాది ఇదే సమయంలో గోదావరికి భారీ వరదలు వచ్చినప్పుడు కడియం మండలంలోని లంకల్లో అనేక కృష్ణజింకలు కనువిందు చేశాయి.

భూములు కరిగిపోయి..

గతంలో కపిలేశ్వరపురం జమీందారు తమకు చెందిన 818 ఎకరాల భూమిని ప్రభుత్వానికి దఖలు పరిచారు. ఈ భూముల్లో కృష్ణజింకలు హాయిగా సంచరిస్తూండేవి. ఇందులో 400 ఎకరాలను ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీకి సుమారు 25 ఏళ్ల క్రితం కేటాయించారు. నాటి అధికారులు పట్టించుకోకపోవడంతో మిగిలిన భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారు. దీనికి తోడు గోదావరి తీర ప్రాంత భూముల్లోని మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొట్టారు. మరికొంత భూమి గోదావరి వరదలకు కోతకు గురైంది. అలా ఆ లంక భూముల్లో దుబ్బుగడ్డి దిబ్బలు, చెట్లు, పొదలు కనుమరుగవుతూ వచ్చాయి.

వరదల వేళ.. కుక్కల బారిన పడి..

సాధారణంగా జింకలు చాలా వేగంగా పరుగు తీస్తాయి. పైగా ఊహకు అందని రీతిలో జిగ్‌జాగ్‌గా పరుగెడతాయి. దీంతో ఇవి ఒకపట్టాన మనుషులకు, ఇతర జంతువులకు దొరకవు. అయితే గోదావరికి వరదలు వచ్చినప్పుడు మాత్రం జింకలు బురదలో దిగబడిపోయి ఎటూ కదల్లేవు. సరిగ్గా అదే సమయంలో కుక్కలు వీటిని సులువుగా వేటాడతాయి. ఇదే విధంగా ఎన్నో జింకలు మృత్యువాత పడ్డాయి.

సమాచారం నిల్

ఇక్కడ కృష్ణజింకల సంఖ్యపై అటవీ శాఖ అధికారుల వద్ద నిర్దుష్ట సమాచారం లేదు. అయితే గత ఏడాది గోదావరి వరదలకు ముందు ఈ ప్రాంతంలో సుమారు 150 కృష్ణజింకలు ఉండేవని, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయో తెలియదని గతంలో ఇక్కడ పని చేసి, ప్రస్తుతం కాకినాడ జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఒక అధికారి చెప్పారు. అటవీ శాఖ అలక్ష్యం కారణంగానే కృష్ణజింకలకు ఈ దుస్థితి వచ్చిందని, ఇప్పటికైనా వన్యప్రాణి విభాగం వీటి సంరక్షణపై దృష్టి సారించాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం



గౌతమీ గోదావరి పరీవాహక ప్రాంతంలో కృష్ణజింకల సంరక్షణ, ఆవాస కేంద్రం ఏర్పాటుపై రెండుసార్లు స్పందనలో విజ్ఞాపన ఇచ్చారు. కృష్ణజింకలు ఎన్ని ఉన్నాయనే డేటా మా వద్ద లేదు. దీనిపై రాజమహేంద్రవరంలోని వన్యప్రాణి విభాగం డివిజన్ అధికారులతో చర్చించాల్సి ఉంది. గోదావరి పరీవాహక భూమి అటవీ శాఖది కాదు. కొంత ప్రైవేటుది. మరికొంత ఇరిగేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల పరిధిలోకి వస్తుంది. కృష్ణజింకల ఆవాస కేంద్రం ఏర్పాటు ఆయా డిపార్ట్‌మెంట్లతో ముడిపడి ఉంది. దీనిపై కలెక్టర్‌తో చర్చించి తద్వారా ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటాం.

– ఎంవీ ప్రసాదరావు, జిల్లా అటవీ అధికారి, అమలాపురం

ఆరంభశూరత్వమే..

ఈ ప్రాంతంలో కృష్ణజింకల సంచారం ఎక్కువగా ఉండటంతో వీటిని సంరక్షించేందుకు అటవీ శాఖ వన్య ప్రాణి సంరక్షణ విభాగం 1990లో 'గౌతమీ కృష్ణజింకల క్షేత్రం' కూడా ఏర్పాటు చేసింది. ఈ మేరకు రావులపాలెం గౌతమీ గోదావరి బ్రిడ్జి వద్ద హోర్డింగ్ పెట్టింది. అయితే అది ఆరంభ శూరత్వమే అయ్యింది. అయితే బోర్డు పెట్టారు తప్ప నాటి వన్యప్రాణి విభాగం అధికారులు కృష్ణజింకల ఆలనా పాలనను విస్మరించారు. రాష్ట్ర విభజన అనంతరం కృష్ణజింకను రాష్ట్ర జంతువుగా ప్రభుత్వం 2018లో ప్రకటించింది. కానీ, వాటి సంరక్షణను మాత్రం నాటి ప్రభుత్వం గాలికొదిలేసింది.



ఆవాస కేంద్రం ఏర్పాటు చేయాలి



రావులపాలెం – వానపల్లి మధ్య గోదావరి పరీవాహక ప్రాంతంలో సుమారు 400 ఎకరాల మిగులు భూమిని సంరక్షించాలి. అందులో కృష్ణజింకలు, వివిధ జంతువులకు ఆవాస కేంద్రం ఏర్పాటు చేయాలి. అలాగే గోదావరి పరీవాహక గ్రామాల్లో జీవ వైవిధ్య మండలి కమిటీలు ఏర్పాటు చేయాలి. మిగులు భూమి, కృష్ణజింకల సంరక్షణ గురించి గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ, గోదావరి హెడ్ వర్క్స్ శాఖలు సంయుక్తంగా సర్వే చేస్తే కనీసం 200 ఎకరాలైనా మిగులు భూమి బయట పడుతుంది.

– పెదపూడి బాపిరాజు,
లంక రైతు, రైతు సంఘం అధ్యక్షుడు, వాడపాలెం

అవసరం వస్తేనే..



గతంలో ఇక్కడ సుమారు 500 కృష్ణజింకలుండేవి. వరదలకు కొట్టుకుపోయి ఎన్నో కనుమరుగయ్యాయి. కుక్కల బారిన పడి ఎన్నో చనిపోయాయి. కుక్కల దాడిలో గాయపడిన వాటిని నేను కాపాడి మళ్లీ లంకలో వదిలిపెట్టాను. ప్రస్తుతం సుమారు 30 జింకలున్నాయి. ఆవాస కేంద్రం ఏర్పాటు చేస్తే ఉన్న జింకలతో పాటు వాటి సంతతి ద్వారా కృష్ణజింకల సంఖ్య పెరుగుతుంది. 2006లో నన్ను యానిమల్ టీకర్‌గా నియమించారు. రూ.20 వేల జీతం ఇచ్చేవారు. దఫదఫాలుగా రూ.25 వేలకు పెంచారు. అలా ఆరేళ్ల పాటు ఇచ్చారు. సుమారు 12 సంవత్సరాల నుంచి జీతం ఇవ్వడం లేదు. అవసరం వచ్చినప్పుడు మాత్రం నన్ను వినియోగించుకుంటున్నారు. గోదావరి నుంచి అవిడి పంట కాలువలోకి వచ్చిన మొసలిని పట్టుకోవడానికి, ముమ్మిడివరం మండలం గేదెల్లంకలో పులిని పట్టుకోవడానికి నన్నే తీసుకువెళ్లారు. – దూనబోయిన సత్యనారాయణ, యానిమల్ టీకర్, వానపల్లి

కొంతమూరులో భారీ చోరీ

- తాళం సరిగ్గా వేయకుండా ఊరికి వెళ్లిన కుటుంబం
- అదే అదనుగా ఇంట్లోకి చొరబడిన దొంగలు
- రూ.8.50 లక్షల బంగారు నగల అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

రాజానగరం: తలుపులకు సరిగ్గా తాళం వేయకుండా ఊరికి వెళ్తే.. ఆ ఇంట్లోకి దొంగలు చొరబడి భారీగా దోచుకుపోయారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో ఈ సంఘటన జరిగింది. సీఐ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం.. ఇంటీరియర్ డిజైనర్ పాండురంగారావు రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా బెంగళూరు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి మెయిన్ డోర్‌కు తాళం వేయగా అది సరిగ్గా పడలేదు. అయినప్పటికీ దానిని అలాగే వదిలేసి, మెయిన్ గేటుకు తాళం వేసి ఊరికి వెళ్లిపోయారు. ఇది గమనించిన దుండగులు మెయిన్ డోర్ నుంచి దర్జాగా ఆ ఇంట్లోకి ప్రవేశించారు. సుమారు రూ.8.50 లక్షల విలువైన 18 కాసుల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న పాండురంగారావు కుమారులిద్దరూ సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని బెంగళూరులో ఉన్న తండ్రికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆయన హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. చోరీపై రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి సీఐ కాశీ విశ్వనాథ్ సిబ్బందితో చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు..
వృత్తి నైపుణ్య కేంద్రాలు

- నేడు, రేపు సమావేశాలు
- సమగ్ర శిక్షా ఉత్తర్వులు

రాయవరం: నిత్యం వెలుగుతున్న కొవ్వొత్తి మాత్రమే ఇతరులకు వెలుగులు పంచుతుంది. అలాగే ఉపాధ్యాయులు కూడా ఉత్తమంగా ఎదగాలంటే నిరంతరం వారి అనుభవాలను ఇతరులతో పంచుకోవాలి. సందేహాలను ఇతరుల ద్వారా నివృత్తి చేసుకోవాలి. దీనికి స్కూల్ కాంప్లెక్స్‌లు (పాఠశాల సముదాయాలు) ఎంతో దోహదపడతాయని కొఠారి కమిషన్ గతంలోనే పేర్కొంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను వివరించడం మాత్రమే కాకుండా విద్యార్థులు అభ్యసన ఫలితాలను సాధించే విధంగా బోధన సాగించాలని విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ–2009) కూడా సూచించింది. ఈ నేపథ్యంలోనే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు సమగ్ర శిక్షా రాష్ట్ర పదాధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాల వారీగా స్కూల్ కాంప్లెక్స్‌ల వివరాలు

జిల్లా	మండలాలు	స్కూల్ కాంప్లెక్స్‌లు
కోనసీమ	22	127
కాకినాడ	21	64
తూర్పు గోదావరి	19	81

ఇదీ ఆవశ్యకత

పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే విద్యా విషయక, ఇతర సమస్యలకు పరిష్కార వేదికగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండాలి. ఉపాధ్యాయులు వారి బోధనా అనుభవాలు, వినూత్న బోధన పద్ధతులను పరస్పరం పంచుకునే వేదికగా ఉండాలి. వారి బోధనా పటిమను పెంచేవిగా ఉండాలి. నిరంతరం విద్యా విషయక సహకారం అందించాలి. ప్రాథమిక స్థాయిలో గుణాత్మక విద్యను పెంపొందించాలి. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడం, డ్రాపౌట్లు తగ్గించాలి. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించాలి. స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు అనువైన, డిజిటల్ ఎక్విప్‌మెంట్, ఇంటర్నెట్ సదుపాయం ఉండే భవనం చూసుకోవాలి. రిఫరెన్స్ పుస్తకాలతో కూడిన లైబ్రరీ ఉండాలి. సమావేశాల్లో ఒక ఉపాధ్యాయుడు మాదిరి పాఠాన్ని బోధించాలి. అనంతరం దానిపై అర్థవంతమైన చర్చ జరగాలి. శాశ్వత టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) తయారు చేసుకోవాలి. తప్పనిసరైతే కొనుగోలు చేయాలి. స్కూల్ కాంప్లెక్స్‌లలో టీఎల్ఎం మేళాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలి. అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలు కాంప్లెక్స్‌లో అందుబాటులో ఉంచుకోవాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలి. వీటిని సీఆర్‌పీలు తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ చేయాలి.

272 స్కూల్ కాంప్లెక్స్‌లలో..

స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్‌ను సమగ్ర శిక్షా అధికారులు విడుదల చేశారు. ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు విధిగా నిర్వహించాలి. దీనిలో భాగంగా మంగళ, బుధవారాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు, అలాగే 6, 7, 8 తరగతుల సబ్జెక్టు ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ రెండు రోజులు సగం మంది చొప్పున ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 272 స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బోధనాభ్యసన పద్ధతులపై విషయ నిపుణత కలిగిన ఉపాధ్యాయులు సాధ్యమైనంత ఎక్కువ సమయం అర్థవంతమైన చర్చ సాగించాలని సమగ్ర శిక్షా అధికారులు సూచించారు. అందుకు తగిన వాతావరణాన్ని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, సెక్రటరీలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో గుర్తించిన మంచి అంశాలను ఇతర పాఠశాలలు కూడా అమలు చేసేలా చర్యలు చేపట్టాలి. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు, డీవైఈఓలు, డీఈఓలు కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించి, పాఠశాలల్లో విద్యాభివృద్ధికి, బోధనాభ్యసన పద్ధతుల పెంపునకు సూచనలు, సలహాలు ఇవ్వాలి.

చర్చలు అర్థవంతంగా జరగాలి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మొక్కుబడిగా కాకుండా, ఉపాధ్యాయులు బోధనాభ్యసన పద్ధతులను మెరుగుపరచుకునే విధంగా నిర్వహించాలి. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వేదికగా నిలవాలి. ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్ ప్రకారం వీటిని నిర్వహించాలి.

– జి.నాగమణి,
ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

నిరంతర అభ్యాసకులు కావాలి

- ఉపాధ్యాయులకు ఆర్‌జేడీ నాగమణి పిలుపు
- హెచ్‌ఎంలకు రెండో విడత లీడర్‌షిప్ శిక్షణ ప్రారంభం


ప్రధానోపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

గండేపల్లి: ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులుగా ఉండాలని పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) జి.నాగమణి పిలుపునిచ్చారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు రెండో దశ లీడర్‌షిప్ రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వెలుగుతున్న కొవ్వొత్తి మరిన్ని కొవ్వొత్తులను వెలిగించగలదని, అలాగే నిరంతరం అభ్యాసకులుగా ఉన్న ఉపాధ్యాయులే సమర్థవంతంగా బోధన చేయగలరని అన్నారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా బోధన చేపట్టేలా బోధనాభ్యసన పద్ధతులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారన్నారు. భవిష్యత్ అంతా డిజిటల్ విద్యా విధానం పైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. మన రాష్ట్ర విద్యార్థులు గ్లోబల్ స్టాండర్డ్స్ అందుకునే విధంగా దేశంలోనే తొలి సారిగా టోఫెల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి, పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలను సమర్థంగా నిర్వహించడం ప్రధానోపాధ్యాయుల శక్తిసామర్థ్యాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. సాల్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలను పెంపొందించడంపై ఐదు రోజుల పాటు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుమతి లేకుండా ఏ ఒక్కరూ శిక్షణా శిబిరాన్ని వదిలి వెళ్లరాదని నాగమణి స్పష్టం చేశారు. శిక్షణ శిబిరం ప్రాధాన్యాన్ని పిఠాపురం డీవైఈఓ డి.సుభద్ర వివరించారు. రెండో దశ శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల ఏఎంఓలు ఎంవీ రామారెడ్డి, దేశెట్టి గౌరీశంకర్, పి.రాంబాబు, మాస్టర్ ట్రైనీలు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామ రాజు, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన 256 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: అత్తను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని నాగులాపల్లి శివారు ఉప్పరగూడేనికి చెందిన మహిళకు, ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన దండ్రు శ్రీనుకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో శ్రీను ఈ నెల 16న తన భార్యపై కత్తితో దాడి చేశాడు. దీనికి అడ్డం పడిన అత్త మెడపై శ్రీను కత్తితో వేటు వేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దాడిలో శ్రీను భార్య తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ దర్యాప్తు చేశారు. శ్రీనును పిఠాపురం వై.జంక్షన్‌లో అరెస్టు చేసి సోమవారం పిఠాపురం కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Paramedical - B.Sc. & Diploma కోర్సులు - Anesthesia, Cardiology, Radiology, M.L.T, O.T. Tech, Emergency, BPT, MPT, Forensic. అర్హత : ఇంటర్. (C) : 90636 15623, 95813 84578 [V-2031]

■ నిమ్రా ఎడ్యుకేషనల్ సొసైటీ వారి నిమ్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్ నందు DMLT/DECG/DCARDIO/DRGA/DOA/ DOM /DANS /DREST /DMST. 2 సం.ల కోర్సులకు ఈ సం. నకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: Inter Pass & ఒకేషనల్ కోర్సులు SC, ST, BC & మైనార్టీ వారికి జగనన్న విద్యాదీవెన ద్వారా ఉచిత విద్య. ✆ 90103 49334, 94412 50210 [B-190710]

Real Estate

■ రాజమండ్రిలో ప్రముఖ విద్యాసంస్థకు బొమ్మూరు, వేమగిరి, కాతేరు, దివాన్‌చెరువు ఏరియాల్లో 3 ఎకరాలు వారి స్థలములోనే 1,00,000 Sft గల బిల్డింగ్ కట్టి ఇవ్వదలచిన వారు సంప్రదించండి. ✆ : 93913 31643 [R-6020]

REAL ESTATE WANTED

■ రాజమండ్రి, బొమ్మూరు, వేమగిరి, కాతేరు, దివాన్ చెరువు పరిసర ప్రాంతాల్లో 2 నుండి 5 ఎకరాల్లో పొలం లేక స్థలం అమ్మదలచినవారు సంప్రదించండి. ✆ : 93913 31643 [R-6021]

GODOWN FOR SALE

■ కాకినాడలో 30 సెంట్లు (1450 చ.గ॥)లో 8000 చ॥ అ॥ మొత్తం లేదా విడిగా (4x365 చ॥ గ॥లు) నెలకు లక్షకు పైగా అద్దెలు వచ్చే గొడౌన్ అమ్మకం. 2000 వేల నోట్లు అయితే తీసుకోబడును ✆ : 99493 43008 [R-99]

HOUSE FOR SALE

■ RJY నేతాజీ నగర్ 11వ వీధిలో E/N 2B/R గ్రౌండ్, 1st ఫ్లోర్ 116 గజాలు ఇల్లు అమ్మకము. ✆ : 96405 33443, 98666 90041 [R-6012]

PLOT FOR SALE

■ రాజమండ్రి దేవిచౌక్ 200గ॥ దూరంలో పేపరు మిల్లు రోడ్డు ముత్తూట్ ఫైనాన్స్ వెనుక 230 గ॥స్థలం అమ్మకమునకు గాని డెవలప్ మెంట్‌గాని ఇవ్వ బడును. Contact No. ✆ : 8143407685/94939 40852 [R-5997]

■ RJY బొమ్మూరు జంక్షన్‌కు 6KM దూరంలో నెలకు 50 వేలు వరకు అద్దె వచ్చు 14000 SFT షెడ్డు 3000 గజాలు స్థలం అమ్మకంనకు కలదు. 9396660652. [C-785925]

Services

GOLD FINANCE



■ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). సంప్ర ✆ 81818 97978 [B-339]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2367]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781996]

Wanted

■ ద్వారపూడి, అనపర్తిలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం॥ డ్యూటీ, జీతం : రూ.11,000/-. ✆ : 96522 44848, 88857 68111 [R-108]

■ పార్ట్‌టైం/ఫుల్‌టైం మంచి ఆదాయం వెల్‌నెస్ ఇండస్ట్రీలో వెల్‌నెస్ కోచ్‌లుగా పని చేయుటకు కావలెను. 18 సం॥లు నిండిన అందరూ అర్హులే. ట్రైనింగ్ ఇవ్వబడును. సంప్ర: RJY. ✆ : 80962 25555 [R-1171852]

■ కాకినాడ, సూర్యారావుపేట డోర్స్ కంపెనీ నందు పనిచేయుటకు ఆఫీస్ బోయ్ కావలెను. టూ వీలర్ తప్పనిసరి ✆ 88826 56789 [B-227]

■ ప్రముఖ గ్లోబల్ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221346]

■ ఈక్షణ హోమ్ హెల్త్‌కేర్‌లో పని చేయుటకు అనుభవం గల నర్సులు (ANM/GSM/B.Sc) & కేర్‌టేకర్స్ కావలెను. జీతం + PF + ఉచిత హాస్టల్. సంప్ర: 73373 13349, 73373 13323 [B-344]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9676414393. [M-1221463]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP& డాక్టర్స్ కావలెను. జీ: 12000–35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-440]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11711]

■ ఇంట్లోనే వుంటూ ఇంటిపని చేస్తూ ఒక మనిషిని చూసుకోవడానికి ఏ బాధర బందీ లేని ఒక ఆడ పనిమనిషి కావలెను. ఫోన్: 70139 19459 [V- 2048]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WALK-IN-INTERVIEW
Work in Luxurious Air Conditioned Office /Convenient Timings,
Urgently Recruitment In Leading MNC Company As A Following posts
ONLY OFFICE WORK
B.D.E'S (Female's Age 18-30)
B.P.O'S (Female's Age 18-30)
Receptionist (Female Age18-30)
Salary+Bonus +Insentives
Qlf. 10th, Inter Degree& Above
RAYS DIRECT SERVICES
6-1-4 , 2 nd floor, Rangachari Street T-Nagar Jyous allukas opposite line Rajamundry-533101.Contact No : 9642086777, 6302775387.

ఉద్యోగ మేళా
తేది: 30-07-2023, ఆదివారం
అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రముఖ ఫార్మా (ఔషధ) కంపెనీ
METROCHEM API PRIVATE LIMITED
VISAKHAPATNAM & HYDERABAD

Department	Qualification	Salary Details	Vacancies	Age Limit
Production	BSc Chemistry	Rs. 1.92 Lakhs per Annum Rs.16,000/- CTC per Month	200	18 to 28 Years
	Any Degree	Rs. 1.8 Lakhs per Annum Rs.15000/- CTC per Month		
	10th & Inter	Rs. 1.74 Lakhs per Annum Rs.14,500/- CTC per Month		
R&D, QC & QA	MSc Chemistry	Rs. 2.1 Lakhs per Annum Rs.17,500/- CTC per Month	50	
Engineering Electrical/Mechanical	ITI / Diploma / B Tech	Rs.1.74/1.8/1.98 Lakhs per annum. Rs.14.5K / 15K / 16.5K CTC per Month	25	
Accounts / Warehouse	B Com	Rs. 1.8 Lakhs per Annum Rs.15000/- CTC per Month	25	
EHS	Any Degree	Rs. 1.8 Lakhs per Annum Rs.15000/- CTC per Month	25	
HR	MBA	Rs. 1.98 Lakhs per Annum Rs.16,500/- CTC per Month	10	

సదుపాయములు :
★ ప్రావిడెంట్ ఫండ్ ★ ఇ.ఎస్.ఐ. ★ వార్షిక బోనస్ ★ ఉచిత భోజనం
★ వసతి (హాస్టల్) సదుపాయం (విశాఖపట్నం నందు స్త్రీలకు మరియు పురుషులకు).
తేది : 30-07-2023, ఆదివారం ఉదయం 8.00 గం॥ల నుండి సాయంత్రం 4.00 గం॥ల వరకు
వివరములకు : 8187888842, 8187888843, 8187888846